

ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యం

జిల్లాలోని అన్నిచోట్లా రైతుబజార్లలో అందుబాటులో..

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 9: జిల్లాలో ఉన్న అన్ని రైతుబజార్లలో కందిపప్పు, బియ్యం తక్కువ ధరపై అందజేస్తున్నట్టు డీఎస్‌వో ఎంపీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఆహార పౌరసరఫరా శాఖ మంత్రి ఆదేశాల మేరకు కందిపప్పు కిలో రూ.160, బియ్యం బీపీటీ, సోనామసూరి కిలో 48 నుంచి 49 రూపాయలకు అందిస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్, హోల్‌సేల్ మార్కెట్‌లో కూడా ఇదే ధరకు విక్రయించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కోట్లు మింగేసిన.. ఘనులు!

సీనరేజీలో కోట్లు పిండేసి..బాకీ కాదనేసి..

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

- సీనరేజీ కాంట్రాక్టులో అక్రమం
- ఏడాదికి రూ.407 కోట్ల ఆదాయం
- రెండేళ్లకు రూ.223 కోట్లకే ఒప్పందం
- అడ్డగోలుగా కట్టబెట్టిన జగన్ సర్కారు
- సర్కారుకు రూ.25 కోట్లకుపైగా బకాయి
- చెల్లించకుండా తప్పించుకునే యత్నం
- గనుల శాఖ నుంచి ఒత్తిడి
- ఉలుకూపలుకూ లేని సుధాకర్ ఇన్‌ఫ్రా
- జగన్ కంపెనీకి రూ.20 కోట్లు రద్దు?
- దానివల్ల రాబడి తగ్గిందని వింత వాదన
- బాకీలో మినహాయించాలని డిమాండ్
- కాంట్రాక్టు కంపెనీకి అధికారుల వత్తాసు
- ఎన్నికల ముందు ప్రభుత్వానికి లేఖ
- ప్రభుత్వం మారడంతో కంపెనీకి షాక్
- మే నుంచి నిలిచిన వసూళ్ల దందా

వడ్డించేవాడు మనవాడైతే అడ్డేముంటుంది.. దోచుకోవచ్చు.. దాచుకోవచ్చు.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చాలా మంది పెద్దలు చేసిందిదే..ప్రస్తుతం అధికారం మారడంతో ఒక్కొక్కరి బాగోతం బయటపడుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆ కంపెనీ మొన్నటి వరకు క్వారీల నుంచి కాసులు పంట పండించుకుంది. లేటరైట్, గనులు, గ్రావెల్ తవ్వకాల నుంచి ముక్కుపిండి సీనరేజీ పేరుతో కోట్లకు కోట్లు దండేసుకుంది. ప్రభుత్వం తరఫున గనుల శాఖ చేయాల్సిన పనని జగన్ ప్రభుత్వం ఏకంగా ఆ కంపెనీకి అడ్డగోలుగా గతేడాది ఏప్రిల్‌లో కట్టబెట్టేసింది. నువ్వు ఎన్ని కోట్లయినా పిండుకో..ప్రభుత్వానికి నెలకు కేవలం రూ.9.70 కోట్లు కడితే చాలంటూ బంపర్ ఆఫర్ ఇచ్చేసింది. ఇంకేం..అప్పట్లో ఓ అధికార పార్టీ నేత అండదండలతో ఆ కంపెనీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రెచ్చిపోయింది. క్వారీలు, గుట్టలు, లేటరైట్, గనుల నుంచి వెళ్లే ప్రతిలారీ నుంచి సీనరేజీ పిండేసింది. నెలకు ప్రభుత్వానికి కట్టాల్సిన దానికంటే రెట్టింపు సొమ్మును చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి మరీ ముక్కుపిండి రాబట్టింది. తీరా ఇటీవల ప్రభుత్వం మారడంతో ఆ కంపెనీ దందాకు చెక్‌పడింది. కానీ ప్రభుత్వానికి కట్టాల్సి ఉన్న సీనరేజీ డబ్బులు మాత్రం ఇప్పటికీ కట్టకుండా డ్రామాలాడుతోంది. అప్పట్లో తన అనుయాయ కంపెనీకి జగన్ సర్కారు రూ.20 కోట్ల వరకు గుట్టుగా సీనరేజీ రద్దు చేయడాన్ని సాకుగా చూపుతోంది. ఆ రద్దు వల్ల తనకు రాబడి పడిపోవడంతో కట్టాల్సిన బాకీ నుంచి మినహాయింపు కోరుతోంది. ఎన్నికలకు ముందు అధికార పార్టీ పెద్దల ద్వారా రాయబారం నడిపింది. ఈలోపు కొత్త ప్రభుత్వం రావడంతో ఏం చేయాలో తెలీక అధికారుల ద్వారా ఒత్తిడి తెచ్చేందుకు డ్రామా మొదలుపెట్టింది.

జగన్ సారూ.. ఉన్నారు?

గత జగన్ ప్రభుత్వంలో పాలన అంతా నిబంధనలకు విరుద్ధంగానే నడిచింది. గనులశాఖలో అయితే ఇక చెప్పనక్కర్లేదు. అడ్డగోలు నిర్ణయాలతో ఖజానాకు కోట్లలో గండి పడింది. వ్యక్తులకు మాత్రం భారీగా ఆర్థిక లబ్ధి చేకూర్చేలా అప్పటి పాలకులు నిర్ణయాలు తీసుకున్నారు. జగన్‌కు చెందిన ఓ బినామీ కంపెనీ రౌతులపూడిలో భారీ కొండలో నల్లరాయి క్వారీ మైనింగ్‌కి అనుమతులు పొందగా దాని మైనింగ్‌కు సంబంధించి ప్రభుత్వానికి కోట్లలో సీనరేజీ కట్టాల్సి ఉంది. కానీ అప్పటి ప్రభుత్వం పూర్తిగా ఈ కంపెనీ కోసం నిబంధనలకు పాతరేసింది. ఒక్క రూపాయి కూడా సీనరేజీ గనుల శాఖకు కట్టక్కర్లేకుండా ఏకంగా మినహాయింపు ఇచ్చేసింది. తద్వారా రూ.20 కోట్ల వరకు సదరు కంపెనీకి భారీ లబ్ధి చేకూర్చిపెట్టింది. సీనరేజీ మినహాయింపు ఆదేశాలు మూడో కంటికి తెలియకుండా రహస్యం పాటించారు. ఇదంతా ఒకెత్తయితే నెలనెలా ప్రభుత్వానికి సుధాకర్ ఇన్‌ఫ్రా కట్టాల్సిన సీనరేజీ కాంట్రాక్టు డబ్బులను కొంతకొంతగా ఎగ్గొడుతూ వస్తోంది. ఇదేంటని అడిగితే జగన్ అనుయాయ కంపెనీకి రూ.20 కోట్ల వరకు సీనరేజీ మినహాయింపు ఇవ్వడంతో తన రాబడి తగ్గిపోయిందని కొన్ని నెలల కిందట కొత్త వాదన తెచ్చింది. ఈ నేపథ్యంలో రద్దు చేసిన రూ.20 కోట్ల సీనరేజీ డబ్బులో కొంత వాటా తన పాత బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ కొత్త పాట పాడింది. ఈ కంపెనీ వెనుక వైసీపీ నేత ఉం డడంతో కాకినాడ గనుల శాఖ ఉన్నతాధికారులు మొత్తబడ్డారు. సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా నెలవారీ చెల్లించాల్సిన సీనరేజీ కాంట్రాక్టు డబ్బులు బాకీ ఉందని, ఈ బాకీలకు ఓ కంపెనీకి ప్రత్తిపాడు నియోజకవర్గంలో రద్దు చేసిన రూ.20 కోట్లకు పైగా సీనరేజీ డబ్బుల్లో కొంత మొత్తాన్ని సర్దుబాటు చేయాలంటూ లేఖ రాశారు.అయితే అప్పటికే రాష్ట్రంలో ఎన్నికల హడావుడి మొదలవడం, ఎన్నికల కోడ్ కూడా వచ్చేయడంతో గత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. కానీ తాను అనుకున్న పని పూర్తి చేయించుకోవడం కోసం సుధాకర్ ఇన్‌ఫ్రా తెగ ప్రయ త్నాలు చేసింది. నెలనెలా కోట్లలో రెట్టింపు రాబడి పిండేసినా కట్టాల్సిన రూ.25 కోట్ల బాకీ చెల్లించకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేసింది. ఈలోపు ఎన్నికలు జరగడం, తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందనే ధీమాతో సదరు కంపెనీ బాకీలు కట్టకుండా ఆగిపోయింది. ఊహించని విధంగా కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో సదరు కంపెనీకి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. కట్టాల్సిన బాకీలు చెల్లించాల్సి రావడం, అటు ప్రభుత్వం మారడంతో సీనరేజీ వసూలు కాంట్రాక్టు నుంచి కూడా తప్పుకోవాల్సి రావడం పెద్ద షాక్‌కు గురిచేసింది. దీంతో ఇప్పుడు సీనరేజీ వసూలు ఎక్కడికక్కడ ఈ కంపెనీ చేయకుండా గనులశాఖ డీడీ కార్యాలయం చెక్‌పెట్టింది. కొత్త ప్రభుత్వంలో తన ఆటలు సాగే అవకాశం లేకపోవడంతో రూ.25కోట్లు ఎగ్గొట్టే ఎత్తు గడలో భాగంగా తిరిగి జిల్లా అధికారుల ద్వారా మళ్లీ ఫైలును పైకి పంపేందుకు ఎత్తుగడ వేస్తోంది.

రూ.814 కోట్ల ఆదాయం వచ్చేది.. 233 కోట్లకే కట్టబెట్టేసి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గనుల శాఖకు చిన్న తరహా ఖనిజాల ద్వారా వచ్చే సీనరేజీ ఆదాయం రాష్ట్రంలో ఏ జిల్లా నుంచి సమకూరడం లేదు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో భారీ నల్లరాయి కొండలు, గ్రావెల్, మట్టి, లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా ఏటా కోట్లలో ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా ఎక్కువ రాబడివస్తోంది. వీటి తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా సీనరేజీతో పాటు రకరకాల ఫీజుల ఆదాయం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గనుల శాఖకు ఏటా రూ.407 కోట్ల వరకు వచ్చేది. అయితే చిన్న ఖనిజాలకు సంబంధించి సీనరేజీ రాబడి ఇంకా వచ్చే అవకాశం ఉన్నా గనుల శాఖ పెద్దగా దృష్టి సారించేది కాదు. కేవలం ఎంత ఆదాయం వస్తే అంత అన్నరీతిలో వ్యవహరించేది. సరిగ్గా గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు దీనిపై కన్నేశారు. చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు బాధ్యత నుంచి గనుల శాఖను పక్కన పెట్టి మొట్టమొదటిసారిగా సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు. దీని వెనుక భారీ తతంగం నడిపారు. టెండర్ల జారీ దగ్గర నుంచి దాఖలు వరకు మూడో కంటికి తెలియకుండా అంతా రహస్యంగా నడిపారు. దీంతో ప్రభుత్వ పెద్దలు తాము అనుకున్న కంపెనీకే ఈ కాంట్రాక్టు కట్టబెట్టారు. గనుల శాఖను పూర్తిగా డమ్మీగా మార్చేసి సీనరేజీ వసూలు బాధ్యత నుంచి తప్పించేసి పెత్తనమంతా సుధాకర్ ఇన్‌ఫ్రాకు కట్టబెట్టేశారు. గనుల శాఖతో సంబంధం లేకుండా ఈ కంపెనీకి సర్వాధికారాలు ఇచ్చేశారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు కాంట్రాక్టు కట్టబెట్టేశారు. రెండేళ్లకు కలిపి రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తే చాలని కాంట్రాక్టులో పేర్కొన్నారు. అది కూడా నెలకు రూ.9.70 కోట్లు చొప్పున 24 వాయి దాల్లో చెల్లించొచ్చని వెసులుబాటు ఇచ్చేశారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు సదరు కంపెనీ నుంచి భారీగా పిండేశారు. ఇంకేం ప్రభుత్వం అండదండలు ఉండడంతో సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా ఉమ్మడి జిల్లాను పిండేసింది. ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొండలు, గుట్టలు, గ్రావెల్, క్వారీలున్న ప్రతిచోటా సొంతంగా మనుషులను నియమించేసింది. సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. రాజమహేంద్రవరం ఆటోనగర్, ధవళేశ్వరం బ్యారేజీపై కూడా తాత్కాలిక చెక్ పోస్టులు పెట్టేశారు. రాత్రీ పగలూ తేడా లేకుండా ఎవరు ఏ చిన్న మట్టి/గ్రావెల్ తవ్వుకున్నా ముక్కుపిండి సీనరేజీ వసూలు చేసేవారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్ల రాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి కూడా వదలకుండా ముక్కు పిండి నెల నెలా కోట్లలో డబ్బులు పిండేసింది. తెర వెనుక కాకినాడ జిల్లాకు చెందిన ఓ కీలక వైసీపీ నేత సహకారం ఉండడంతో గనులశాఖ సైతం కళ్లుమూసే సుకుంది.సీనరేజీ వసూళ్లలో నిబంధనలు ఉల్లంఘించినా అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ.9.70కోట్ల కంటే అంతకుమించి రెట్టింపు ఆదాయం పిండేసింది. ఒకరకంగా చెప్పాలంటే సీనరేజీ కాంట్రాక్టు ఈ కంపెనీకి కాసుల పంట పండించింది.

అధికారులేమో బాకీ డబ్బుల కోసం ఆ కంపెనీపై ఒత్తిడి తేకుండా సహకరిస్తుండడం విశేషం.



స్విచ్ఆన్‌చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, నెహ్రూ, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు

పురుషోత్తపట్నం ఫేజ్-2 నుంచి సాగునీరు విడుదల

జగ్గంపేట, జూలై9: జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో పురుషోత్తపట్నం ఫేజ్-2 నుంచి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌లు నీటిని విడుదల చేశారు. ముందుగా లిఫ్ట్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేలకు ఇరిగేషన్ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గోదావరి నీటికి హారతి ఇచ్చి మూడు పంపులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యక్రమానికి రావాల్సి ఉందని, ఆయన షెడ్యూల్ ఖాళీ లేకపోవడంతో రాలేకపోయారన్నారు. గత ఐదేళ్ల నుంచి వైసీపీ పాలనలో ఎత్తిపోతల పథకాలన్నీ పనిచేయకుండా పోయాయని, మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటికి మరమ్మతులు చేసి నీటిని విడుదల చేయడం జరుగుతోందన్నారు. ఏలేరులో నీటి సామర్థ్యాన్ని పెంచి రైతులందరికీ నీరందించేందుకు ఈ పంపులను ప్రారంభించామన్నారు. ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, జూనియర్ ఇంజనీర్ జగదీష్, కూటమి నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అడబాల వెంకటేశ్వరరావు, జంపన సీతారామచంద్రవర్మ, గొల్లపల్లి బుజ్జి, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గం సంబంధించి టీడీపీ, జనసేన నాయకులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఏలేరు ఆయకట్టుకు గోదావరి జలాలు : మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూలై9: పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను ఏలేరు కాలువలకు మళ్లించే ప్రక్రియ ప్రారంభమైందని, ఆయకట్టు పొలాలకు ఈ జలాలు అందుతున్నాయని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఇక రైతులకు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతుందని చెప్పారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న గోదావరి జలాలు ఏలేరు కాలువలోకి కలిసే ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే వర్మ, టీడీపీ నేతలు పరిశీలించారు. గోదావరి జలాలు తాగి తన జన్మ ధన్యమైందంటూ ఆనందం వ్యక్తంచేశారు. గతంలో టీడీపీ అధికారంలోకి ఉండగా గోదావరి జలాలను మళ్లించి ఏలేరు, పీబీసీ ఆయకట్టుకు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందించామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని నిరుపయోగంగా మార్చిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నమాట ప్రకారం పథకాన్ని ప్రారంభించామన్నారు. ఆయన వెంట పలువురు నేతలు ఉన్నారు.



ఏలేరు కాలువలోకి వస్తున్న జలాలను చూస్తున్న వర్మ

డబుల్ ఇంజన్ సర్కారు వట్టి ప్రగల్భాలే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

- 7లో

ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 9: జిల్లాలో నిరుద్యోగ యువతకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం వికాస ఆధ్వర్యంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, పీడీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీసీఎస్, టెక్ మహేంద్ర వంటి ప్రముఖ కంపెనీల అధికారులతో మాట్లాడి నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ఏవియేషన్ సెంటర్ల ద్వారా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసి ఎయిర్‌హోస్టెస్, కేబిన్ క్రూ, స్టాఫ్ ఉద్యోగాలను ఇప్పించాలని సూచించారు.

రైతుబజార్‌లో రగడ.. ఇంకా వైసీపీ పెత్తనమేనంటూ ఆరోపణలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై9: నగరంలో రైతుబజార్లు సైతం రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. ప్రధానంగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైతుబజార్ వైసీపీ నేతలకు గత కొన్నేళ్లుగా అడ్డాగా మారింది. వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అనుచరులు ఈ రైతుబజార్‌ను తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. ఓవైపు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ, మరోవైపు వైసీపీ అనుకూలమైన వారికి దుకాణాలు కేటాయిస్తూ దందాలు సాగించారు. ఇది చినుకుచినుకు గాలివానగా మారి కొంతమంది రైతులు కోర్టు మెట్లను ఎక్కే వరకు వచ్చింది. రైతుబజార్‌లో అంతర్గత వివాదాలను చక్కదిద్దేందుకు వ్యవసాయ మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ మంగళవారం ఆర్టీసీ రైతుబజార్‌కు విచ్చేశారు. అక్కడ ఇరువర్గాల రైతులను కూర్చోబెట్టి చర్చలు జరిపారు. సమస్యను పరిష్కరించాలని ఆయన ప్రయత్నించినప్పటికీ ఇరువర్గాలు ఒకేతాటిపైకి రాకపోవడంతో కోర్టులో పిటిషన్ విత్‌డ్రా చేయకుంటే ఏం చేయలేమని ఆయన వెనుదిరిగి వెళ్లిపోయారు. తర్వాత ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దిగారు. వైసీపీ పాలనలో టీడీపీ వర్గానికి చెందిన రైతులం ఎన్నో ఇబ్బందులుపడ్డామని, టీడీపీ హయాంలోనూ వైసీపీ పెత్తనమే సాగుతోందని కొందరు వాపోయారు. మార్కెట్ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి ఇక్కడ ఉన్న రొటేషన్ విధానాన్ని రద్దుచేసి తనకు అనుకూలమైన వారికి ప్రధాన దుకాణాలను కేటాయించడంతో వీరి మధ్య వివాదాలు మొదలయ్యాయి.



నిత్యం ప్రమాదాలే

- జంక్షన్ల వద్ద లైట్లు కూడా లేవు
- ముందుజాగ్రత్తలు తీసుకోవడంలో ఎన్‌హెచ్ విభాగం విఫలం
- పిఠాపురం బైపాస్‌రోడ్డులో ప్రయాణం భయం..భయం

అధికంగా ప్రమాదాలు జరిగే పిఠాపురం బైపాస్‌రోడ్డు- ఇల్లింద్రాడ వై జంక్షన్ వద్ద లైట్లు కూడా లేని దృశ్యం

పిఠాపురం, జూలై 9: వేల సంఖ్యలో వాహనాలు తిరిగే రహదారి అది. నిత్యం ప్రమాదాలే. చిన్నచిన్న గాయాల బారినపడే వారి సంఖ్యకు అంతే ఉండదు. గ్రామాల నుంచి ఈ రహదారిని కలిపే జంక్షన్ల వద్ద కనీస ముందుజాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో ఈ మార్గంలో వెళ్లేవారితోపాటు గ్రామాల నుంచి నుంచే వచ్చేవారు భయంభయంగా ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా నివారణకు చర్యలు తీసుకోవాల్సిన ఆర్‌అండ్‌బీ ఎన్‌హెచ్ విభాగం అధికారులు నిద్రావస్థలో జోగుతున్నారు. రాత్రయితే పరిస్థితి మరీ దారుణం. జంక్షన్లన్నీ అంధకారంలో ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారుల కమిటీ సూచించి అయిదేళ్లు దాటినా ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఎన్‌హెచ్ విభాగం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. పిఠాపురం పట్టణానికి సమాంతరంగా బైపాస్‌రోడ్డు (216వ జాతీయరహదారి) ఉంది. తొలుత రెండు లైన్ల రహదారిగా ఉన్న ఈ రోడ్డును 216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అయిదేళ్ల కిందట నాలుగు లైన్ల రహదారిగా విస్తరించారు. బైపాస్‌రోడ్డు విస్తరణలో వాహనాల రాకపోకలకు వీలుగా ఉంటుందని, గ్రామాల నుంచి వచ్చే వారికి సౌకర్యంగా ఉంటుందని అంతా భావించారు. అందుకు విరుద్ధంగా బైపాస్‌రోడ్డు వారికి శాపంగా పరిణమించింది. గ్రామాల నుంచి ఈ రోడ్డు ఎక్కాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. రహదారి నిర్మాణ సమయంలో ఆర్‌అండ్‌బీ ఎన్‌హెచ్ విభాగం అధికారులు, కాంట్రాక్టు సంస్థ కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ రోడ్డుపై ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రమాదాలు అధికంగా ఎక్కడ జరుగుతున్నాయో గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల కమిటీ అయిదేళ్ల కిందట సూచనలిచ్చింది. నేటికీ అవి అమలుకు నోచుకోలేదు. పిఠాపురం బైపాస్‌రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. సామర్లకోట వైపు నుంచే వాహనాలే గాక సుమారు 25-30 గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తూ ఉంటారు. నిత్యం వందలు, వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతాయి. గ్రామాల నుంచి వచ్చి కలిసే రోడ్లు, పిఠాపురం పట్టణంలో నుంచి వచ్చే రహదారులు, బైపాస్ కలుసుకునే జంక్షన్లు ఆరు ఉన్నాయి. పట్టణంలో నుంచి వచ్చే ఆర్ అండ్‌బీ రహదారి, బైపాస్‌రోడ్డు-ఇల్లింద్రాడ వద్ద వైజంక్షన్ ఉంది. రాపర్తి రోడ్డు- అగ్రహారం జంక్షన్, భీమ్‌నగర్ (నరసింగపురం) రోడ్డు-సీతయ్యగారితోట జంక్షన్, విరవాడ (కోలంక)రోడ్డు జంక్షన్, పాదగయ వద్ద పిఠాపురం-సామర్లకోట రోడ్డు జంక్షన్, చిత్రాడ ఆర్వోబీ వద్ద రహదారి-బైపాస్ రోడ్డు కలిపే ఆర్వోబీ జంక్షన్లు ఉన్నాయి.



పిఠాపురం బైపాస్-విరవాడ(కోలంక) జంక్షన్ వద్ద ఓ పక్కకు ఉన్న స్టాపర్ బోర్డులు

ప్రమాదాలు పెరిగాయి..

పిఠాపురం బైపాస్‌రోడ్డు ఏర్పడిన నాటి నుంచి వాహనాల అతివేగంతో ప్రమాదాలు జరిగేవి. రోడ్డు దాటే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరగడం, వాహనదారులు గాయాలబారిన పడటం నిత్యకృత్యంగా మారాయి. దీని నియంత్రణకు బైపాస్‌కు కలిసే రహదారులపై అప్పట్లో స్పీడు బ్రేకర్లు ఏర్పాటుచేశారు. ఇందులో ఇల్లింద్రాడ వై జంక్షన్, పాదగయ, విరవాడ రోడ్డు, భీమ్‌నగర్, రాపర్తి రోడ్డు జంక్షన్లు అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించారు. విస్తరణ తర్వాత పరిస్థితి నియంత్రణలోకి వస్తుందనుకుంటే ప్రమాదాలు మరింత అధికమయ్యాయి. రోడ్డు విస్తరణ తర్వాత వాహనాలు అతివేగంగా వెళ్లిపోతుడడంతో జంక్షన్లు దాటడం గగనంగా మారింది. రాత్రి సమయంలో పరిస్థితి మరీ దారుణం. రెప్పపాటులో వాహనాలు వచ్చేస్తుండడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఇదే విషయాన్ని ప్రమాదాల నివారణకు అయిదేళ్ల కిందట నియమించిన అధికారుల కమిటీ తన సిఫారసుల్లో స్పష్టంగా పేర్కొంది. పిఠాపురం పట్టణంలో కోర్టులు, పశువుల సంత దాటి బైపాస్‌కు వెళ్లేందుకు నిర్మించిన అప్రోచ్ రహదారిని రెండు భాగాలు చేశారు. పట్టణంలో నుంచి వెళ్లే రోడ్డు సరిగ్గా బైపాస్‌లో ఎదురుగా వాహనాలొచ్చే ప్రాంతంలో కలిపారు. దీంతో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం పొంచి ఉంది. పట్టణంలో నుంచి వచ్చే వాహనదారులకు దగ్గరకు వచ్చేవరకూ బైపాస్‌లో వచ్చే వాహనాలు కనబడని పరిస్థితి. పాదగయ జంక్షన్, కోలంకరోడ్డు, నరసింగపురం రోడ్డు జంక్షన్ల వద్ద ఉంది. అగ్రహారం-రాపర్తిరోడ్డు-బైపాస్ జంక్షన్ వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గ్రామాల నుంచి వచ్చే రోడ్డుపై నుంచి బైపాస్ దాటాలంటే దగ్గరకు వచ్చేవరకూ వాహనాలు కనిపించడం లేదు. ఇక్కడ ఏ మాత్రం ఆ జాగ్రత్తగా ఉన్నా బైపాస్‌లో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొట్టి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. ఈ జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా నియంత్రణ చర్యలు చేపట్టలేదు. పోలీసుశాఖ తాత్కాలికంగా స్టాపర్‌బోర్డు ఏర్పాటుచేసింది.

రాత్రయితే అంధకారమే

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం అన్ని గ్రామాలు, పట్టణాల్లో జంక్షన్ల వద్ద, నివాస ప్రాంతాలు ఉన్న చోట్ల లైట్లు ఏర్పాటుచేయాలి. ఇక్కడ బైపాస్‌రోడ్డును, జంక్షన్లను పూర్తిగా విస్మరించారు. పాదగయ జంక్షన్ వద్ద మినహా మిగిలిన ఎక్కడా లైట్లు ఏర్పాటుచేయలేదు. రాత్రయ్యేసరికి ఇవన్నీ అంధకారంలో ఉంటున్నాయి. దీనివల్ల ప్రమాదాలు అధికమవుతున్నా పట్టించుకోని ఎన్‌హెచ్ విభాగం అధికారులు కేవలం లైటింగ్ ఇండికేటర్లు ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారు. విశాఖ-కాకినాడ మార్గంలో తిరిగే ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ బైపాస్ మీదు గానే వెళ్లిపోతున్నాయి. ఇక్కడ ప్రయాణికులు దిగి పట్టణంలోకి వెళ్లాలంటే భయంగా భయంగా వెళ్లాల్సి వస్తోంది. పిఠాపురం బైపాస్‌రోడ్డులోని జంక్షన్లతోపాటు రోడ్డు పొడవునా లైట్లు ఏర్పాటుచేయాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శ్రద్ధాంజలి



అప్యాయతానురాగాలు
పంచి మమ్ములనందరినీ
తీర్చిదిద్ది మా అభివృద్ధికి
పూలబాటలు వేసిన
మీ జ్ఞాపకాలు
మీ మార్గదర్శకాలు...
సదా మీ స్మృతులు
సర్మించుకుంటూ...
మీ పవిత్ర ఆత్మకు
శాంతిని
ప్రసాదించమని
భగవంతుని
ప్రార్థిస్తున్నాము.

శ్రీ గోలి ధర్మరాజు గారు
మరణం: 01-07-2024
ఆదిలక్ష్మి ఇండస్ట్రీస్, వేట్లపాలెం

కుమారుడు : గోలి రవికుమార్ కోడలు : సాయిఅనంతలక్ష్మి
కుమార్తె : నున్న వెంకటలక్ష్మి అల్లుడు : రామకృష్ణ (రాంబాబు)
అధ్యక్షులు: కాకినాడ జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్
మనుమలు, మనుమరాండ్రు కుటుంబసభ్యులు
మరియు ఆదిలక్ష్మి ఇండస్ట్రీస్, సిబ్బంది

పెద్దకార్యం: ది.11-07-2024 గురువారం సామర్లకోట (మం), వేట్లపాలెం గ్రామంలో మా స్వగృహమునందు జరుగును. సెల్: 98661 35667

భవన నిర్మాణ కార్మికుల కడుపు నింపేందుకు ఉచిత ఇసుక విధానం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ మేరకు ఉచిత ఇసుకను వినియోగదారులకు అందించే కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో ప్రారంభించడం శుభపరిణామమని, గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కడుపుకొడితే కూటమి ప్రభుత్వం కడుపు నింపే విధంగా ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఉచిత ఇసుక పాలసీని మంత్రి దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి, కమిషనర్ దినేష్‌కుమార్, ఆర్డీవో చైత్రవర్షిణిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వినియోగదారుడు ఎవరైనా ఇల్లు కట్టుకోవాలంటే ఇబ్బందులు పడడం చూశామని, దీంతో కేవలం ట్రాన్స్‌పోర్టేషన్‌కు రుసుము కట్టుకునేలా ఉచితంగా ఇసుక విధానాన్ని తీసుకొచ్చామన్నారు. గతం తాలూక ముసుగు తీసి వేసి ఇసుక పాలసీని సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సహజ వనరులు దోపిడీకి గురయ్యాయని, గతంలో తాను కడియపులంకకు వెళ్లి పరిశీలించినపుడు అక్కడ అక్రమంగా నదీ గర్భంలోకి వెళ్లి ఇసుకను దోచేసిన సంఘటన వెలుగులోకి తీసుకొచ్చామన్నారు. జేపీ కంపెనీ, మరో కంపెనీలు చేసిన దానిపై సీబీఐ విచారణ జరపాలని కూడా సీఎం చంద్రబాబుకు లేఖ పంపినట్టు గుర్తుచేశారు. ఇసుకను బోట్స్‌మెన్ సొసైటీలను రివైజ్ చేస్తూ దానిని స్టాక్ పాయింట్‌కు తీసుకువచ్చి అక్కడ నుంచి పేదలకు ఉచితంగా అందించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో జగన్ అతని ప్రజాప్రతినిధులు విచ్చలవిడిగా ఇసుకను దోచేశారన్నారు. జేపీ ఇచ్చే ఒక వేబిల్లుతో ఎన్నో ట్రిప్పులు వేసేవారన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక దందాలో ఉన్న ప్రతి ఒక్కరి డేటా తమ వద్ద ఉన్నదని చర్యలు ఉంటాయన్నారు.

ప్రభుత్వానికి లాభాపేక్ష లేకుండా ఉచిత ఇసుక విధానం: కలెక్టర్

పేదలకు ఉచిత ఇసుక పాలసీ ప్రారంభించామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్టాక్ పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక కావాల్సిన వారు ఆధార్ కార్డు, ఇంటి ప్లాన్ అప్రూవల్ కాపీ తీసుకుని రావాలన్నారు. పాత ఇళ్ల మరమ్మతులు చేయించుకునేవారు పాత ప్లాన్లు తీసుకుని రావాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ డిపార్టుమెంట్ల సమన్వయంతో ఇసుక పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలి పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. చెక్‌పోస్టుల వద్ద విజిలెన్స్ ఉంటుందన్నారు. ఇతర జిల్లాలకు ఇసుక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా విశాఖ జిల్లాకు ఇవ్వాల్సి ఉంటుందని అటువంటి వాటికి కలెక్టర్ రిక్వెస్ట్ ద్వారా ఇవ్వాల్సి ఉందన్నారు.. బోట్స్‌మెన్ సొసైటీల డిసిల్టేషన్‌కు సంబంధించి ధవళేశ్వరం సీఈ చూస్తున్నారన్నారు. స్టాక్ పాయింట్‌లో డిప్యూటీ తహశీల్దార్లను పెడుతున్నామన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1800 4252540కు ఫోను చేయాలని చెప్పారు. ప్రజలు తమకు నచ్చిన వాహనాల్లో వచ్చి లోడింగ్ చార్జీలు చెల్లించి నేరుగా ఇసుకను తీసుకువెళ్లవచ్చని తెలిపారు. జిల్లాలో 7 ఇసుక స్టాక్ పాయింట్‌లు ఉన్నాయని, వాటిలో చిడిపి స్టాక్ యార్డ్ వద్ద 36,051 టన్నులు, పందలపర్రు స్టాక్ పాయింట్‌లో 52,082 టన్నులు, పెండ్యాలలో 1,46,259 టన్నులు, ఉసులుమర్రులో 33,065 టన్నులు, కాతేరులో స్టాక్ యార్డ్‌లో 6,939 టన్నులు, లాలాచెరువు వద్ద 7,403 టన్నులు, బుర్రిలంక స్టాక్ పాయింట్ వద్ద 20,862 టన్నులు ఇసుక ఉందని తెలిపారు. టన్ను ఇసుక ధర రూ.270గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నూతన ఇసుక విధానంలో దుర్వినియోగం చేస్తే సహించేదిలేదని, ఇసుక బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ సుబ్రహ్మణ్యం, ఆర్డీవో శ్రీదేవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబు, నక్కా దేవివరప్రసాద్, కోసూరి చండీప్రియ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏపీఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్

జేఎన్టీయూకే, జూలై 9: ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ లకోసం ఈనెల 1న ప్రారంభమైన ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ మంగళవారం కూడా కొనసాగింది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 7తో ముగిసింది. ధ్రువపత్రాల పరిశీలన 4న మొదలు కాగా ఇప్పటి వరకూ కాకినాడ జేఎన్టీయూకే సహాయ కేంద్రంలో 4200 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పరిశీలించినట్లు హెల్ప్‌లైన్ సెంటర్ సమన్వయకర్త ప్రొఫెసర్ ఎస్.బాలాజీ తెలిపారు. అంతే కాకుండా వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఈనెల 12 వరకూ కొనసాగుతుందని, 13న ఆప్షన్లను మార్పు చేసుకోవచ్చని, 16న సీట్ల కేటాయింపు జరుగుతుందని 17 నుంచి 22లోపు సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని ఈనెల 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే వర్సిటీలోని యూసీఈకేలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. అంతే కాకుండా 79956 81678, 79958 65456, 91779 27677 హెల్ప్‌డెస్క్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చని బాలాజీ తెలిపారు.

ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌లో విద్యుత్ బిలులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించకపోతే గనుక వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్ట్రన్ పవర్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని గాని, సంస్థ వెబ్‌సైట్ నుంచి గాని బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ గాని వెబ్‌సైట్ ద్వారా గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని సీఎండీ చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా బ్యాగులు, పుస్తకాలు

తొండంగి,జూలై 9: ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా బ్యాగులు, నోటు పుస్తకాలు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కస్తూర్బా విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులతో పాటు హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు బ్యాగులతో పాటు 6 వైట్, 6 రూళ్ల లాంగ్ నోటు పుస్తకాలు అందిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 17964 మంది విద్యార్థులకు వీటిని అందించనున్నారు. ఇప్పటికే వీటిని మండల కేంద్రాలకు పంపిణీ చేశారు. కాకినాడ జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 4026 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3802 మంది ఉండగా కోనసీమ జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 1790 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 1763 మంది, తూర్పుగోదావరి జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 3326 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3257 మంది ఉన్నారు. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 9142 మంది, ద్వితీయ సంవత్సరం 8822 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.

సమగ్ర శిక్షా సిబ్బంది జీతాల బకాయిలు విడుదల చేయాలి

అమలాపురం టౌన్, జూలై 9: పాఠశాల విద్యా శాఖలోని సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న 25వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులకు బకాయిపడ్డ జీతాలను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కేఎస్ లక్ష్మణరావు మంగళవారం ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర ఉన్నతాధికారులకు, మంత్రికి లేఖలు పంపించారు. మే, జూన్ నెల జీతాలను చెల్లించాల్సి ఉందని, జీతాల బడ్జెట్‌ను వెంటనే విడుదల చేసి చిరుద్యోగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీతాల బకాయిలతో పాటు గత ఏడాది డిసెంబరు 19 నుంచి జనవరి 9 వరకు 22 రోజుల పాటు సమగ్ర శిక్షా సిబ్బంది డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేశారు. సమగ్ర శిక్షా సిబ్బంది అప్పటి జేఏసీ నాయకులతో చర్చించగా సమ్మె కాలపు జీతాలు చెల్లించేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఇంతవరకు ఆ బకాయిలను విడుదల చేయలేదని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు సమగ్ర శిక్షా ఉన్నతాధికారులకు, ఆర్థికశాఖ కార్యదర్శికి వినతిపత్రాలు పంపించారు. సమగ్ర శిక్షా ఆధీనంలో మండల విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల అకౌంటెంట్లు, ఆఫీసు అసిస్టెంట్, సీఆర్‌ఎంటీలు, ఐఈఆర్టీలు, ఆయా, పీటీఐలు జీతాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకుని ఆయా కుటుంబాలు అప్పుల బారిన పడకుండా జీతాల బకాయిలు విడుదల చేయాలని ఎమ్మెల్సీ ఐవీ కోరారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

కోరుకొండ, జూలై 9: రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులు, పురుగుమందుల షాపులు తనిఖీల్లో భాగంగా కోరుకొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కోరుకొండకు చెందిన గ్రోమోర్ ఎరువుల షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉండాల్సిన బరువు కంటే తక్కువ బరువు కలిగి ఉన్నారన్న కారణంగా రూ.1.36 లక్షలు విలువైన 177 బస్తాల ఎరువులను సీజ్ చేసినట్లు విశాఖపట్నానికి చెందిన ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.మోహన్‌రావు తెలిపారు. అదే విధంగా హరి ఎరువుల షాపును తనిఖీ చేయగా అక్కడ ఒక రకం పురుగుల మందు శాంపిల్ తీయని కారణంగా ఈ మందు అమ్మకాన్ని నిలుపుదల చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత నాలుగు రోజులు తూర్పుగోదావరిలో ఎరువులు, పురుగుల మందుల తయారీ సంస్థలు, షాపులు, గోదాములు తనిఖీ చేశామన్నారు. రిటైల్, హోల్‌సేల్‌కు సంబంధించి 25 షాపులు తనిఖీ చేశామన్నారు. సుమారు రూ.66 లక్షలు విలువ గల ఎరువులు, పురుగుమందులను సీజ్ చేయడం, నిలుపుదల చేయడం చేశామన్నారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, అగ్రికల్చరల్ ఏడీఏ మల్లికార్జునరావు, ఏవో గౌరీదేవి పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారు వట్టి ప్రగల్భాలే..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కాకినాడ సిటీ, జులై 9: పేరుకు తప్ప డబుల్ ఇంజన్ సర్కారుతో ఈ రాష్ట్రానికి ఒరిగేదేమీలేదని కాకినాడ సూర్యకళా మందిరంలో మూడు రోజులపాటు జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు రెండో రోజు మంగళవారం కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాజమహేంద్రవరంలో జరిగిన ఆ పార్టీ రాష్ట్ర సదస్సులో చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత ఏర్పడిన డబుల్ ఇంజిన్ సర్కార్ అప్పుడు కూడా ఏమీ చేయలేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఏదో చేస్తామని ప్రగల్భాలు పలకడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం మాటల గారడీ మాని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలన్నారు. రాష్ట్రం విడిపోయి పది సంవత్సరాలు దాటిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఐటీ రంగంలో దూసుకుపోతోందన్నారు. తెలంగాణ ఐటీ ద్వారా 80 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతుంటే ఆంధ్రలో 3.6 శాతం మాత్రమే సపోర్ట్ ఉంటోందని వివరించారు. విభజన హామీలు నెరవేర్చాలన్నా, ఆంధ్ర ప్రదేశ్ ఐటీ రంగంలో, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందాలన్నా ప్రత్యేక హోదా తోనే సాధ్య మన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం నిలబడాలని, అఖిల పక్షం ఏర్పాటు చేయాలని రామకృష్ణ సూచించారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రాజకీయాల్లోకి రావాలని, తద్వారా సమాజంలో అవినీతిలేని రాజకీయాలు చేయాలని రామకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా భారతదేశ చరిత్ర సంస్కృతి, వక్రీకరణ అనే అంశంపై ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యవర్గ సభ్యుడు డి.సోమసుందర్, నేటి రాజకీయాలు- ప్రత్యామ్నాయం అనే అంశంపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జీవీ సత్యనారాయణమూర్తి, మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలు అనే అంశంపై ప్రముఖ వక్త పెన్మెత్స సుబ్బరాజు ప్రసంగించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, టి అన్నవరం, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

53 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 9: ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బ్యారేజ్ నుంచి 53,464 క్యూసెక్కుల మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. వ్యవసాయ అవసరాల కోసం 9700 క్యూసెక్కులను 3 డెల్టా కాలువలకు విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం ఆర్మ్‌లో 45 గేట్లు, ర్యాలీ ఆర్మ్‌లో 20 గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 5 గేట్లు, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 15 గేట్లను 20 మిల్లీమీటర్ల మేర పైకి ఎత్తి మిగులు జలాలను దిగువకు విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. తూర్పుడెల్టాకు 3600 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు.

లక్ష్యాలను అధిగమించేలా ఉపాధ్యాయుల శిక్షణ ఉండాలి

టీచ్ టూల్ ప్రాజెక్టు స్టేట్ ఇన్‌చార్జి సతీష్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణ లక్ష్యాలను అధిగమించేలా ఉండాలని టీచ్ టూల్ ప్రాజెక్టు స్టేట్ ఇన్‌చార్జి డాక్టర్ పి.సతీష్‌రెడ్డి అన్నారు.. టీచ్ టూల్ కార్యక్రమంపై రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్లో 9 రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను మంగళవారం ఆయన రాష్ట్ర పర్యవేక్షక బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధనను మెరుగుపరచడం కోసం, మూల్యాంకనం చేయడం కోసం టీచ్ టూల్ అనే సాధనాన్ని అభివృద్ధి చేసి ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్, ప్రైమరీ టీచర్, సీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ప్రతిఒక్కరు శిక్షణ లక్ష్యాలను బాగా అవగాహన చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు జరిగిన శిక్షణ డాక్యుమెంటేషన్‌ను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీమెట్ ప్రొఫెసర్ ఎ.ప్రభాకరరావు, సమగ్ర శిక్షా జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్, కోర్స్ డైరెక్టర్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, రిసోర్స్‌పర్సన్స్ ఎన్.శ్రీనివాస్, జె.స్వప్నప్రియ, కె.లక్ష్మణరేఖ, ప్రవీణ్ శిరీష పాల్గొన్నారు.

హోంగార్డులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డిని కలిసి విన్నవించిన పలువురు హోంగార్డులు



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందిస్తున్న హోంగార్డులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: రాష్ట్రంలో ఉన్న 16 వేల మంది హోంగార్డులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు బాధిత హోంగార్డులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో వారిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. హోంగార్డులను రాష్ట్ర ప్రభుత్వ యూనిఫాం సర్వీసు డిపార్ట్‌మెంట్‌లలో సీనియారిటీ ప్రాతిపాదికన విలీనం చేయాలని, ఇతర శాఖాపరమైన బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. హోంగార్డులకు ఇస్తున్న రోజువారీ వేతనం సరిపోక ఇబ్బందులు పడుతున్నామని గత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. హోంగార్డు వ్యవస్థ 1963 నుంచి ఇప్పటివరకు వలంటీర్ వ్యవస్థగానే పరిగణిస్తున్నారని ఏళ్ల తరబడి పోలీసులతో సమానంగా పనిచేస్తున్న తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, టీఏ, డీఏ సదుపాయాలు లేవని, కానిస్టేబుల్‌గా పదోన్నతులు లేవన్నారు. హోంగార్డులుగా చేసి పదవీవిరమణ చేసిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం లభించడంలేదన్నారు. అందువల్ల తమ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేయాలని వారు విజ్ఞప్తి చేశారు. మంత్రి, ఎమ్మెల్యేలను కలిసిన కె.మురళీ, పి.పాపారావు, ఐ.సతీష్, ఇజ్రాయేలు, బాపిరాజు, లక్ష్మణ్, కామేశ్వర్, గిరి, మూర్తి, సాయి, కాళీ, సూరిబాబు, లలిత, సుజాత, భారతి, సరళ, జాన్సీ, శ్రీదేవి, 20 మంది హోంగార్డులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు అలవాటు పడి చోరీలు

212 గ్రాముల బంగారం రికవరీ



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

రాజమహేంద్రవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): తండ్రి బాటలోనే నడిచిన కొడుకు దొంగతనాలకు అలవాటు పడ్డాడు. చిన్న వయసులో చిన్న దొంగతనాలతో మొదలుపెట్టి క్రమంగా పెద్ద చోరీల వైపు మళ్లాడు. ఓ కేసులో డొంక లాగిన పోలీసులకు చిక్కడంతో కటకటాల్లోకి నెట్టారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతమూరుకు చెందిన కొండేటి సాయి తండ్రి రాంబాబు చోరీలు చేసేవాడు. కరోనాతో రెండేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో 10వ తరగతి వరకూ చదువుకొన్న సాయి 2017 నుంచే చిన్న చిన్న దొంగతనాలు చేయడానికి అలవాటు పడ్డాడు. మిల్క్ డెయిరీ, ఫ్లిప్‌కార్ట్ తదితర చోట్ల ఉద్యోగం చేశాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడడంతో జీతం సరిపోయేది కాదు. దీంతో మళ్లీ చోరీలవైపు మళ్లాడు. ఈసారి కాస్త పెద్ద దొంగతనాలపై దృష్టి పెట్టాడు. ఇళ్లలో రాత్రి వేళల్లో దొంగతనాలు చేసేవాడు. గత ఏడాది సెప్టెంబరు 22న పాత బొమ్మూరులోని ఓ ఇంట్లో జరిగిన చోరీపై క్రైం నెం.311/2023గా బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి సాయిని మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామని డీఎస్పీ వివరించారు. అతడి వద్ద నుంచి 212 గ్రాముల బంగారు, 1.5 కిలోల వెండి ఆభరణాలు, రూ.90 వేల నగదు, ఒక మోటార్‌సైకిల్‌ను రికవరీ చేశామన్నారు. రాజానగరం పీఎస్‌లో రెండు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఒక చోరీ కేసు, అంబాజీపేట, సామర్లకోటలో బైండోవర్ కేసులు ఉన్నాయని, గడిచిన ఏడాది కాలంలో ఆరు కేసులు బొమ్మూరు పీఎస్‌లో నమోదయ్యాయని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ ఎండీ ఉమర్, ఎస్ఐలు బి.శ్రీను, ఆర్.అంకారావు, ఏఎస్సై ఏకే సత్యనారాయణ, హెచ్‌సీ పి.వెంకటేశ్వరరావు, పీసీ కె.సురేశ్‌బాబును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

ఎటపాక,జూలై 9: నాలుగేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారం చేశాడు. అల్లూరి జిల్లా ఎటపాక మండలంలోని ఓ గ్రామంలో జరిగిన ఈ ఘోరం ఆలస్యంగా వెలుగుచూసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి పదేళ్ల క్రితం బతుకుదెరువుకు ఇక్కడకు వచ్చిన ఆదివాసీ కుటుంబం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వారి ఇంటిలో నాలుగేళ్ల చిన్నారి ఉంటోంది. ఆదివారం అమరవరపు రాము అనే వ్యక్తి చిన్నారి ఇంటికి వెళ్లి చాక్లెట్లు ఇస్తానని చెప్పి అతని ఇంటికి తీసుకెళ్లి అమానుషంగా అత్యాచారం చేశాడు. చిన్నారికి రెండు రోజుల నుంచి నలతగా, జ్వరంగా ఉండడంతో తల్లి అడగడంతో జరిగిన విషయాన్ని బయటపెట్టింది. దీంతో బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం చెక్కు అందిస్తున్న దాతలు

సామర్లకోట జూలై 9: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో దేవదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన యరపోతిన వెంకటరామచౌదరి, ఆశారాణి దంపతులు లక్ష రూపాయల విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ సిబ్బందికి అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం మాట్లాడుతూ భక్తులకు ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం అమలుతీరును పరిశీలించి సంతృప్తి చెందిన అనంతరం వెంకటరామచౌదరి దంపతులు ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. దాతలకు స్వామి వారి, అమ్మవారి ప్రత్యేక దర్శనాల అనంతరం ప్రసాదాలు చిత్రపటాలను ఆలయ సిబ్బంది అందించారు. వేద పండితులు సోమేశ్వర శర్మ, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

కోటనందూరు, జూలై 9: కాకినాడ జిల్లా కోటనందూరులో శ్రీ మహలక్ష్మీ రైస్ మిల్లు నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం... కోటనందూరు పరిసర ప్రాంతాల నుంచి రేషన్‌కార్డుదారుల నుంచి తక్కువ రేటుకు బియ్యం కొనుగోలు చేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి అక్రమంగా లారీలో తరలించేందుకు సిద్ధం చేస్తుండగా పట్టుకున్నామని విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో 25,300 కిలోల రేషన్ బియ్యం, నాలుగు ఎలక్ట్రికల్ కాటాలు, 1400 కిలోల ఫోర్టిఫైడ్ రైస్, 12300 కిలోల బియ్యం, 3750 కిలోల ధాన్యం, 1500 కిలోల బ్రోకెన్ బియ్యం, 1050 కిలోల రైస్ బ్రాన్‌ను సీజ్ చేశామన్నారు. రవాణా, అమ్మకం చేస్తున్న పోతల రాంబాబు, శెట్టి శ్రీనివాస్, కోన ప్రభుదాస్, మోహన్‌లాల్‌యాదవ్, అనంద్‌దేవాంగన్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏవో భార్గవమహేష్, డీసీటీవో నవీన్‌కుమార్, లోవరాజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పేరుతో రుణాలు స్వాహా

పిఠాపురం పట్టణానికి చెందిన యానిమేటర్ నిర్వాకం



విచారణ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

పిఠాపురం రూరల్, జూలై 9: మహిళా సంఘాల పేరుపై రుణాలు తీసుకుని వాటిని స్వాహా చేసిన యానిమేటర్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు డీఆర్డీఏ అధికారులు విచారణ చేపట్టారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.కొత్తూరు గ్రామంలో 58 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటికి పిఠాపురం పట్టణానికి చెందిన దారా పద్మకుమారి యానిమేటర్‌గా వ్యవహరిస్తున్నారు. మహిళలను వివిధ సంఘాల్లో సభ్యులుగా చేర్చి బ్యాంకు ఆఫ్ బరోడా, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సహా ఇతర బ్యాంకులు నుంచి రుణాలు ఇప్పించేది. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల వారిని సభ్యులుగా చేర్చి యానిమేటర్ లక్షలాది రూపాయలను తమ పేరుపై రుణాలు తీసుకుని పక్కదోవ పట్టించిందని, 2019 నుంచి 2022 వరకూ ఈ వ్యవహారం జరిగిందని పలు మహిళా సంఘాల సభ్యులు జిల్లా కలెక్టరు షాన్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఆర్డీఏ అధికారులు విచారణ చేపట్టారు. తాము రుణాలు తీసుకోకుండా అప్పులు చెల్లించాలని బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు తమపై ఒత్తిడి తేవడంతో విషయం తెలిసిందని మహిళా సంఘాల సభ్యులు తెలిపారు. తాము తీసుకోని రుణాలకు ఎలా చెల్లిస్తామని తాము ప్రశ్నించి ఫిర్యాదు చేశామని చెప్పారు. వెలుగు ఏపీఎం ప్రియదర్శిని మంగళవారం 30 గ్రూపులను విచారించగా 15 గ్రూప్‌ల సభ్యులు తాము రుణాలు తీసుకున్నట్లు తెలపగా మిగిలిన వారు తీసుకోలేదని చెప్పారు. ఈ గ్రూపుల పేరు మీద రూ.60లక్షలు అక్రమంగా యానిమేటర్ రుణాలు పొందినట్లు గుర్తించారు. అదే విధంగా బ్యాంకు ఆఫ్ బరోడా మేనేజర్ యానిమేటర్ పద్మకుమారి నుంచి రూ.50 లక్షల వరకూ రికవరీ చేసినట్లు ఏపీఎం తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతున్నదని, పూర్తయితే ఎంత మేర రుణాలు అక్రమంగా పొందారో, ఎంత మేర దుర్వినియోగానికి పాల్పడ్డారో తేలుతుందని చెప్పారు.

ఎర్రకాలువలో గుర్తు తెలియని మృతదేహం

అనపర్తి, జులై 9 : అనపర్తి శివారు కొత్తూరు వద్ద ఎర్రకాలువలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు కాలువ నుంచి మృతదేహాన్ని వెలికితీసి శవ పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్ఐ హనుమంతరావు మాట్లాడుతూ సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుని మృతదేహాన్ని గుర్తించామని శరీరంపై స్కైబ్లూ కలర్ పొడవు చేతుల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ఉందని సుమారుగా 5.6 ఎత్తు ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. చనిపోయి రెండు రోజుల పైబడి కావచ్చని మృతదేహం గుర్తుపట్టేందుకు వీలులేకుండా ఉందని దుస్తుల ఆధారంగా వివరాలు తెలిసిన వారు అనపర్తి పోలీసులను సంప్రదించాలని అన్నారు, వీఆర్వో కోసూరి రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు తెలిపారు.

సత్యదేవుని నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, జూలై 9: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన డివి సీతారామస్వామి లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్, బ్యాంక్ అనుబంధ సంస్థలో కావలెను. Sal + Inc. 40 వేల వ : 30-70 yrs. Q : 10th + రిటైర్డ్, వ్యాపారస్తులు, RMP డాక్టర్స్, గృహిణులు, ఇన్సూరెన్స్ ఏజెంట్స్‌కు, మార్కెటింగ్‌కు ప్రాధాన్యత ✆ 99666 34511 సాయంత్రం 5 టు 10 గం. మాత్రమే ఫోన్ చేయగలరు.

AJB-141

4 Lines CLASSIFIED Rs.230/- Only

కాకినాడ

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

తుని రూరల్, జూలై 9: వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే సాగులో ముందుకెళ్లవచ్చని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ దయాకర్, డాక్టర్ ఏఎస్ఆర్ శర్మ తెలిపారు. తిమ్మాపురం, తేటగుంట ప్రాంతాల్లో అరకొరగా సాగు అవుతున్న పత్తిపంటలను వారు పరిశీలించారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధ్యమవుతుందన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు భవాని, సత్యనారాయణ పాల్గొన్నారు.

పశువధకు పాల్పడితే కఠిన చర్యలు : ఆర్డీవో

పిఠాపురం, జూలై 9: అనుమతులు లేకుండా పశువధకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ హెచ్చరించారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో నియోజకవర్గంలో పశుమాంసం వ్యాపారం చేసే వారితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. అక్రమంగా కబేళాలు నిర్వహించినా, పశువులు రవాణా చేసినా, గోవులను వధించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అనుమతులు ఉన్న కబేళాల్లోనే పశువుల కటింగ్ చేసి నిర్దేశించిన ప్రాంతంలోనే విక్రయాలు జరపాలని చెప్పారు. మాంసం విక్రయదారులందరు ఈ నిబంధనలు పాటించాలని లేకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదేశాలు పాటించకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. సమావేశంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనరు కనకారావు, 3మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసులున్నారు.

'రైతుల అభ్యున్నతే సీఎం ధ్యేయం'

ఏలేశ్వరం, జూలై 9: రైతుల అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. మంగళవారం జలవనరులశాఖ నిధులు సుమారు రూ.18లక్షలతో ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం గ్రామాల్లో తిమ్మనాజు చెరువు కాలువల్లో పూడిక తీత పనులకు ఎమ్మెల్యే, ప్రత్తిపాడు జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు వరుపుల తమ్మయ్యబాబు, గంటా బాలుదొర కొబ్బరికాయలుకొట్టి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సాగునీరు అందించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, పెంద్ర శ్రీను, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెంటకోట మోహన్, గట్టిం వెంకట రమణ, రెడ్డి లోవరాజు, వైభోగుల సుబ్బారావు, పెంద్ర శ్రీను, మామిడి లలిత, సామంతుల గోపి, కోరాడ కృష్ణమోహన్, చిక్కాల లక్ష్మణరావు, పి.శ్రీధర్ పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాం'

కిర్లంపూడి, జూలై 9: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించామని, అస్తవ్యస్తంగా ఉన్న వాటిని సరిచేస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెహ్రూ హాజరయ్యారు. ఉచిత ఇసుక విధానంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాజుపాలెం నుంచి రామవరం వెళ్లే రోడ్డుపై సమావేశంలో చర్చించగా ఆర్అండ్‌బీ శాఖాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత ఎస్వీఎస్ అప్పలరాజు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, ఆళ్లబాబులు, ఆదారి నానాజీ, ఉప సర్పంచ్ జగన్నాధరావు, జంపన సీతారామచంద్రవర్మ, సర్పంచ్ చంటిబాబు, అల్లు విజయ్‌కుమార్ ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, కాళ్ల వెంకటేష్, కపిలవాయి సూరిబాబు ఎంపీడీవో బడే రాజేశ్వరరావు పాల్గొన్నారు.

'మూడు చట్టాలను రద్దు చేయాలి'

జగ్గంపేట, జూలై 9: జూలై 1 నుంచి కేంద్రప్రభుత్వం అమలు చేసిన 3 క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ ఎం.ఏసు, మోహన్ డిమాండ్ చేశారు. జగ్గంపేట షాదిఖానాలలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జరిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రభుత్వ రంగంలో కొనసాగించేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ముఖ్య అతిథిగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికవర్గం సంఘటితంగా పోరాడి కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టాలన్నారు. తెలంగాణ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ అనురాధ సందేశం ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

'గొంచాల పాఠశాలను స్ఫూర్తిగా తీసుకోవాలి'

సామర్లకోట, జూలై 9: మండలంలో గొంచాల గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య మరింత పెంపుదలకు విశేష కృషిచేసిన పాఠశాల అధ్యాపక బృందాన్ని మిగిలిన పాఠశాలలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంఈవో వై.శివరామకృష్ణయ్య పేర్కొన్నారు. గొంచాల, నవర పాఠశాలలను మంగళవారం ఎంఈవో సందర్శించారు. విద్యార్థుల పఠనా నైపుణ్యాలు, రాత నైపుణ్యాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలలో పరిశుభ్రత పాటించాలని, కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా సమగ్ర పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల సంసిద్ధత కార్యక్రమాలు, ఉపాధ్యాయుల డైరీస్, లెసన్ ప్లాన్, తదితర రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాక్ సిరామిక్స్ ఉద్యోగుల ధర్నా

కాకినాడ సిటీ, జులై 9: ఎన్నికల ముందు సామర్లకోట రాక్ సిరామిక్స్ టైల్స్ పరిశ్రమలో ఏ కారణం లేకుండా తొలగించిన 24 మంది పర్మినెంట్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ దారపురెడ్డి క్రాంతి, జిల్లా కోశాధికారి మలకా రమణ మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులను అకారణంగా తొలగించి 24 మంది కార్మికుల కుటుంబాలను రోడ్డునపడేశారన్నారు. ధర్నాలో రాక్ సిరామిక్స్ ఉద్యోగులు చంద్రశేఖర్, రామకృష్ణ, అర్జునరావు, జీవీ మల్లికార్జునరావు, కాళ్ల మంగారావు, సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ లేఖ

సామర్లకోట జూలై 9: సామర్లకోట ఏడీబీ రోడ్డులో గల రాక్ సిరామిక్ పరిశ్రమలో విధుల నుంచి తొలగించిన కార్మికులను సత్వరం విధుల్లోకి తీసుకుని సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మంగళవారం రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు లేఖ రాశారు. సుమారు 24 మంది కార్మికులను ముందస్తు నోటీసులు లేకుండా ఈ ఏడాది ఏప్రిల్ 15న విధుల నుంచి తొలగించారన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జాయింట్ లేబర్ అధికారి ఆదేశించినా, 4 దఫాలు చర్చలు జరిపినా ఏ ఫలితం లేకపోయిందన్నారు. తక్షణం సంస్థ యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులను తిరిగి విధులలోకి తీసుకోవాలని లేఖలో ఎమ్మెల్సీ కోరారు.

పిఠాపురంలో డ్రైవర్స్‌కాలనీ వాసుల నిరసన

పిఠాపురం, జూలై 9: లేఅవుట్ల పేరుతో కాలువలు మూసివేస్తున్నారని, దీని వల్ల నివాసప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదముందని పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ వాసులు తెలిపారు. ఉప్పాడ రైల్వేగేటు నుంచి డ్రైవర్స్‌కాలనీ మీదుగా వర్షపు నీరు, డ్రైయిన్లల్లో నీరు కిందకు పోయేదని, ఇప్పుడు పంటపొలాలను లేఅవుట్లుగా మార్చి ఈ కాలువలను మూసివేశారని ఆరోపించారు. దీంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతున్నదని, చిన్నపాటి వర్షానికే కాలనీ ముంపునకు గురవుతున్నదని తెలిపారు. పంట కాలువలకు నీరందడం లేదని, అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు అక్కడ నిరసన తెలిపారు. ఇదే విషయంపై వారు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టరు ఆదేశాల మేరకు అధికారులు వచ్చి పరిశీలన జరిపారు. కార్యక్రమంలో రైతు జీను మాణిక్యాలరావు, కౌన్సిలరు బోనాసుల శివ తదితరులు ఉన్నారు.

'వాటరు పైపులైన్ నిర్మాణం చేపట్టాలి'

తాళ్లరేవు, జూలై 9: పోలేకుర్రు గ్రామంలో నూతనంగా వాటరు పైపులైన్ నిర్మాణం చేపట్టాలని టీడీపీ నేతలు సాదనాల శివరామకృష్ణ, వూడా రామకృష్ణ డిమాండ్ చేశారు. పోలేకుర్రులో 35ఏళ్ల క్రితం వేసిన పైపులైను పాడైపోయిందని, రోజూ మరమ్మతులు చేస్తున్న తాగునీరుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కొత్త పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు వేయాలని కోరారు.

పాదగయలో పనిచేయని ల్యాండ్‌లైన్ ఫోన్

పిఠాపురం, జూలై 9: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ఈవో కార్యాలయంలో భక్తులకు సమాచారం అందించేందుకు గానూ బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైన్ ఫోన్ 08869-252477 ఫోన్ ఉంది. కొంతకాలంగా ఫోన్ పనిచేయడం లేదు. దీంతో సమాచారం కోసం ఫోన్ చేసే వివిధ ప్రాంతాల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలంగా ఈ ఫోన్‌కు సంబంధించి బిల్లులను పాదగయ అధికారులు చెల్లించలేదు. అధికారుల నిర్లక్ష్యం ఇప్పుడు భక్తులకు శాపంగా మారింది. ఇప్పటికైనా పాదగయ అధికారులు నిద్రావస్థ వీడతారో లేదో వేచి చూడాలి.

నిలిచిపోయిన భూ రిజిస్ట్రేషన్లు

ప్రత్తిపాడు, జూలై 9: ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని 13గ్రామాల భూముల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్‌కు చెందిన 4 మండలాల పరిధిలోని 13 గ్రామాల్లో కొన్ని నెలలుగా రిజిస్ట్రేషన్లు స్తంభించి ఆయా గ్రామాలకు చెందిన భూ అమ్మకం దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డిని వివరణ కోరగా కొద్ది రోజుల్లో ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

డయేరియాపై ప్రచారం

కాకినాడ సిటీ, జులై 9: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ స్థానిక 29వ డివిజన్‌లో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు మంగళవారం డయేరియాపై ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి అమలకంటి బలరామ్, మాజీ కార్పొరేటర్ సిరియాల లక్ష్మి, కరకవలస నాగమణి, గొల్లపూడి శ్రీదేవి, జనసేన ఇన్‌చార్జి రామారావు, కొమ్మిరెడ్డి శ్రీను, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పేదల కోసమే ఉచిత ఇసుక విధానం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం, జూలై 9: కూటమి ప్రభుత్వంలో ప్రతీ పేదవాడు ఇళ్లు నిర్మించుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక విధానం ప్రవేశ పెట్టారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన పార్టీ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు. మంగళవారం లింగంపర్తి గ్రామంలో తమ్మయ్యబాబు నేతృత్వంలో ఇసుక ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో సామాన్యుడికి గుప్పెడు ఇసుక అందని పరిస్థితి ఉండేదని, ఇసుక పేరుతో వైసీపీ నాయకులు పేదల రక్తాన్ని తాగారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెంటకోట మోహన్, చిక్కాల లక్ష్మణరావు, పెంటకోట శ్రీధర్, సుబ్బరాజు, సూతి వీరప్రభాకర్ గట్టిం వెంకట రమణ, రెడ్డి లోవరాజు,బస్సా ప్రసద్, చందువోలు సాయిరాజ్, నూకతాటి ఈశ్వరుడు, కొప్పుల బాబ్జి, తదితరులున్నారు.



ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో ఉచిత ఇసుక విధానం ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ

'హామీ నెరవేర్చిన చంద్రబాబు'

పెద్దాపురం, జూలై 9: సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నెరవేర్చారని, దీంతో భవన నిర్మాణ రంగం కొత్త పుంతలు తొక్కుతుందని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. స్థానిక ఏడీబీ రహదారిలో ఏర్పాటుచేసిన ఇసుక ర్యాంపు వద్ద ఇసుక పంపిణీ విధానాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం గృహ నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేసిందని, ఇకపై భవన నిర్మాణ రంగం వేగంగా ముందుకు సాగుతుందన్నారు. పేదల సొంతింటి కల నెరవేరుతుందని, ఇసుకను నామమాత్రపు ధరకే ఆన్‌లైన్‌లో విక్రయిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జె.సీతారామారావు, రాజా సూరిబాబురాజు, నిమ్మకాయల రంగనాగ్, తూతిక రాజు, విత్తనాల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

'ఇసుక కష్టాలకు చెల్లు'

సర్పవరం జంక్షన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తేవడంతో ఇసుక కష్టాలు తీరి కార్మికుల జీవనోపాధితో పాటూ నిర్మాణ రంగం ఊపందుకుంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. మంగళవారం రమణయ్యపేట టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుకను అక్రమంగా అమ్మేసి కోట్లు దోచుకున్నారన్నారు. ఇసుక సామాన్యులు, మధ్య తరగతికి అందుబాటులో లేకుండా చేయడంతో లక్షలాది మంది కార్మికుల పొట్టకొట్టారన్నారు. ఉచిత ఇసుకను అమలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'ఆనందంలో ప్రజలు'

రౌతులపూడి: ఉచిత ఇసుకతో ప్రజలు ఆనందంలో ఉన్నారని, గత ప్రభుత్వ ఇసుక మాఫియా రాజ్యం పోయిందని టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యాలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్డీయే ప్రభుత్వం నెల రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తూ జీవో జారీ చేసిందన్నారు. ప్రభుత్వం నిర్ణయంతో పేదలు, భవన నిర్మాణ కార్మికులు కళ్లల్లో ఆనందం కనిపిస్తుందన్నారు.



పెద్దాపురం: ఇసుక విధానాన్ని ప్రారంభిస్తున్న తుమ్మల రామస్వామి



తాళ్లరేవులో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

కార్యకర్తలకు అండగా ఉంటా: దాట్ల

తాళ్లరేవు, జూలై 9: టీడీపీ కార్యకర్తలందరికీ అండగా ఉంటానని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మంగళవారం తాళ్లరేవు కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి కార్యకర్తలందరికీ పంపిణీ చేశారు. దాట్ల కార్యకర్తలతో మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం తాళ్లరేవు ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, గుత్తుల సాయి, ధూళిపూడి వెంకటరమణ, పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు, టేకుమూడి సత్యనారాయణ, పొన్నమండ రామలక్ష్మి,కార్యకర్తలున్నారు.

స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన ఉండాలి: డీఎంహెచ్‌వో

జీజీహెచ్ (కాకినాడ), జూలై 9: సమగ్ర నవజాత శిశువులకు స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. మంగళవారం ఈ స్క్రీనింగ్ శిక్షణా తరగతుల కార్యక్రమం జీజీహెచ్‌లో పీడియాట్రిక్ లెక్చర్ గాలరీలో నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో గల అన్ని పీహెచ్‌సీ, యుపీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏహెచ్, టీహెచ్‌ల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్క్రీనింగ్ శిక్షణా తరగతులు మంగళవారం నుంచి ఈనెల 11 వరకు జరుగుతాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుట్టుకతో లోపాలు కలిగిన నవజాత శిశువులు, శారీరకఅభివృద్ధి జాప్యాల గల 18 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి జిల్లాలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లకు రిఫర్ చేయాలన్నారు. తద్వారా డీఈఐసీ బృందం జీజీహెచ్ లో వైద్య బృందం నిపుణుల సహకారంతో చిన్నారులకు పూర్తిస్థాయిలో వైద్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. పీడియాట్రిక్ విభాగ హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ, వైద్య నిపుణులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరమ్మ, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ ఐ.ప్రభాకర్ పాల్గొన్నారు.

'భారీ బడ్జెట్‌తో భారతీయుడు-2'

పోర్టు సిటీ (కాకినాడ), జులై 9: కమల్‌హాసన్ హీరోగా నటించిన భారతీయుడు-2 సినిమా శుక్రవారం విడుదవుతున్న సందర్భంగా భానుగుడి సమీపంలో గల ఆనంద్ సినీ కాంప్లెక్స్‌లో మంగళవారం సాయంత్రం సురేష్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సురేష్ ప్రొడక్షన్స్ మేనేజర్ పొన్నం రమేష్ మాట్లాడుతూ 28 ఏళ్ల క్రితం శంకర్ దర్శకత్వంలో భారతీయుడు సినిమా విడుదలై సంచలన విజయం సాధించిందని చెప్పారు. అవినీతి నిర్మూలనే ధ్యేయంగా సామాజిక ఇతివృత్తంతో భారతీయుడు-2 సినిమాను భారీ బడ్జెట్‌తో తీశారన్నారు. అనిరుధ్ సంగీత దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మొత్తం 8 మంది ఫైట్ మాస్టర్లు పని చేశారని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సురేష్ మూవీస్ ద్వారా ఈ నెల 12న సినిమా భారీ ఎత్తున రిలీజ్ అవుతోందని వివరించారు. పర్వతిన శ్రీనివాస్, మేనేజర్ వి.నారాయణరావు, బాలు, తిరుమల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్వహణపై అసంతృప్తి

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 9: కాకినాడ 43వ డివిజన్‌లోని తోట నరసింహం పార్కు నిర్వాహణ లోపాలపై నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్కులో అనేక అవకతవకలు జరిగాయంటూ స్థానిక జనసేన, టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు ఎస్ఈ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం విచారణకు వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు అయిన మాజీ కార్పొరేటర్ ఓ కార్పొరేట్ సంస్థ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంటును వాణిజ్యపరంగా నిర్వహించడం వంటి లోపాలు గుర్తించారు. సీజ్ చేయాలని, వాచ్‌మెన్ తొలగించి మరొకరిని నియమించాలని అధికారులకు సూచించారు. రికార్డులు పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన అనంతరం బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈఈ మాధవి, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, అసిస్టెంట్ ఇంజనీర్ వై.నాగేశ్వరరావు ఉన్నారు.

గ్రామసభ నిర్వహణపై అభ్యంతరం

కరప, జూలై 9: పెనుగుదురు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యదర్శి చంద్రకళ జనసేన పార్టీ నాయకులకు మాత్రమే సమాచారం ఇచ్చారని టీడీపీ ఎస్సీసెల్ మండల సమన్వయ కమిటీ అధ్యక్షుడు పులపకూర మహేష్, మాజీ సర్పంచ్ కుంతీభవానీ ఆరోపించారు. సజావుగా గ్రామసభను నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, ఎంపీటీసీ బండారు సుజాత వెంకటేశ్వరరావు, వార్డుసభ్యులు బండారు మురళి, తుమ్మలపల్లి విష్ణు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ భవనాన్ని పూర్తి చేయాలి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి

కార్పొరేషన్ (కాకినాడ), జూలై9: విశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న కాకినాడ నగరపాలక సంస్థ నూతన భవనాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశించారు. మంగళవారం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులతో కలిసి సినిమారోడ్‌లో నిర్మిస్తున్న నూతన భవన ప్రాంగణాన్ని పరిశీలించారు. పనుల ప్రగతిని కమిషనర్ వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.38కోట్ల స్మార్ట్‌సిటీ నిధులు, రూ.20కోట్లు నగరపాలక సంస్థ నిధులతో ప్రతిపాదించిన కార్పొరేషన్ భవనం నాలుగేళ్ళ గడిచిన పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. పన్నుల రూపంలో ఏటా రూ.77కోట్లు వసూలవుతున్నప్పటికీ కార్పొరేషన్‌కు సొంత భవనాన్ని రూపొందించుకోలేకపోయామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన నిర్లక్ష్యం వల్లే పనులు కుంటుపడ్డాయని వనమాడి విమర్శించారు. నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టి.రమేష్ ఉన్నారు.



పనులపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న కమిషనర్

సమస్యల పరిష్కారానికి కృషి

కాకినాడ సిటీ, జులై 9: హోంగార్డుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 16వేలమంది హోంగార్డుల ను రాష్ట్ర ప్రభుత్వం యూనిఫామ్ డిపార్ట్‌మెంట్‌లలో సీనియార్టీ ప్రాతిపదికన విలీనం చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌గోవిందు ఉన్నారు.

మాజీ మంత్రి రాజా వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

తుని కూటమి నేతలు



తునిలో మాట్లాడుతున్న నాయకులు

తుని రూరల్, జూలై 9: ఇటీవల తునిలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో అభ్యంతర కర వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజాపై తుని కూటమి పార్టీల నేతలు ధ్వజమెత్తారు. కాపు సామాజిక వర్గ టీడీపీ నాయకుడు చింతమనీడి నాగ సోమరాజు, జనసేన నాయకుడు బోనం చినబాబు మాట్లాడుతూ కాపుల కోసం మాట్లాడే నైతిక హక్కు రాజాకెక్కడిదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో కాపు ఓట్లతో గద్దెనెక్కి కాపుల కోటలో మంత్రిగా వెలగబెట్టిన మీరు అప్పుడు కాపుల కోసం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మళ్ల గణేష్ మాట్లాడుతూ తునిలో తుంటరి రాజకీయాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజా మాటలను ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తుని నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొందన్నారు. ప్రోటోకాల్ నిబంధనల కోసం మాజీ మంత్రి మాట్లాడటం హాస్యాస్పదమని, గతం మాదిరిగా అన్యాయం, అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడితే ఊరుకునే పరిస్థితి ఉండదని తెలిపారు. టీడీపీ నాయకులు మోతుకూరి వెంకటేష్, యనమల లక్ష్మణరావు, జక్కాన రామునాయుడు, కుక్కడుపు బాలాజీ, బోడపాటి శ్రీను, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, నార్ల రత్నాజీ, అత్తి అచ్యుతరావు పాల్గొన్నారు.

'ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు'

దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

శంఖవరం, జూలై 9: రైతులకు విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఉపసంచాలకులు కే.త్రినాధస్వామి హెచ్చరించారు. మండలంలోని కత్తిపూడిలో విత్తనాలు, ఎరువులు షాపులను విజిలెన్స్ అధికారులు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్ వివరాలు, బోర్డు ధరల పట్టికలు పరిశీలించి ధరలు పట్టిక షాపు వద్ద రోజూ ఉంచాలన్నారు. ప్రతీ కొనుగోలుపై వినియోగదారుడికి బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. ఏవో పి.గాంధీ, చినబాబు తదితరులు ఉన్నారు.

తొండంగి: బెండపూడిలో పురుగుల మందుల షాపుల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ డీడీ త్రినాద్, విజిలెన్స్ ఐటీపీడీ సతీష్ కుమార్ షాపులు తనిఖీ చేసి యజమానులకు సూచనలు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారం సాగిస్తే చర్యలు తప్పవని చెప్పారు.



శంఖవరం:స్టాక్‌బుక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: వేట్లపాలెంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాన్ని వ్యవసాయ శాఖ ప్రత్యేక తనిఖీ అధికారులబృందం తనిఖీ చేసింది. వ్యవసాయ శాఖ డీడీఏ కె. త్రినాథస్వామి, డీవీవీ.సతీష్, కాకినాడ వ్యవసాయ టెక్నికల్ ఏవో ఎన్.విజయలక్ష్మి నాయకత్వం వహించగా సామర్లకోట ఏవో ఐ.సత్య పాల్గొన్నారు. ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు.

వేళంగి పాఠశాలలో ఉన్నతాధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



దోమల బెడదపై విచారిస్తున్న డీపీవో, డీఈవో

కరప, జూలై 9: ఈ విద్యాలయం..దోమల నిలయం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో మంగళవారం వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారిణి కె.భారతిసౌజన్య, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, సబ్‌యూనిట్ మలేరియా ఆఫీసర్ నాగబాబు వేళంగి మెర్లస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వారి వెతలను అడిగి తెలుసుకున్నారు. దోమకాటుతో దద్దుర్లు, పుండ్లు పడిన విద్యార్థులను పరీక్షించారు. పాఠశాలలో మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేయాలని వైద్యఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. దోమలున్న చోట పైరిత్రమ్ అనే మందును పిచికారీ చేయించారు. పాఠశాలంతా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. దోమల ఉధృతి తగ్గే వరకు అన్ని చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. డీఎల్‌పీవో అమ్మాజమణి, సర్పంచ్ నవిలే నీలిమా రాజేష్, వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎంకే సౌజన్య, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ, ఇన్‌చార్జ్ హెచ్ఎం కె.పద్మావతి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

సామర్లకోట జూలై 9: హుస్సేన్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులకు వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు హిమశ్రీ, పరదేశ్‌ల ఆధ్వర్యంలో గ్రామంలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐసీడీఎస్ మంజూరైన పౌష్టికాహార కిట్లను టీడీపీ నాయకుడు చల్లా బుజ్జి గర్భిణులకు, బాలింతలకు అందజేశారు. కోట అప్పారావు, సురేష్,అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

గొల్లప్రోలు రూరల్, జూలై 9: సాధారణ పంటలతో పాటు చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టిసారించాలని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ సూచించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం చిరుధాన్యాల సాగుపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ రాగి, జొన్న, సజ్జలు, గంటి ఉదలు వంటి వాటిని 50శాతం సబ్సిడీపై అందిస్తామని చెప్పారు. ఎకరానికి రెండు, మూడు కిలోల విత్తనాలు సరిపోతాయని తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఎఫ్‌టీసీ, పిఠాపురం వ్యవసాయశాఖ ఏడీలు భ్రమరాంబ, పి.స్వాతి, ఏవో సత్యనారాయణ పాల్గొన్నారు.

'కోనోకార్పస్ చెట్లు తొలగింపు వేగవంతం చేయాలి'



బోట్‌క్లబ్‌ను సందర్శిస్తున్న అధికారులు

సర్పవరం జంక్షన్/ కార్పొరేషన్, జూలై 9: పర్యావరణం, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్ల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ జె.వెంకటరావు, జిల్లా అట వీశాఖాధికారి ఎస్.భరణి ఆదేశించారు. మంగళవారం స్థానిక బోట్‌క్లబ్, జన్మభూమి పార్కులో కోనోకార్పస్ చెట్ల తొలగింపును పర్యవేక్షించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కోనో కార్పస్ చెట్లు తొలగిస్తున్నట్టు తెలిపారు. కాకినాడలో పలు పార్కుల్లో సుమారు 500 కోనో కార్పస్ చెట్లు ఉన్నాయని, ఇందులో బోట్‌క్లబ్ పార్కులో సుమారు 100 చెట్లు ఉన్నాయన్నారు. ఈ చెట్ల స్థానంలో ప్రత్యామ్నాయంగా పార్కుల్లో టటూబియా బాటిల్ ఫ్రెష్, వెదురు వంటి మొక్కలు నాటడంపై చర్చించారు. రమణయ్యపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న ఈ చెట్లును కూలీలు తొలగించారు.

స్కూలు కిట్లు తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

గొల్లప్రోలు రూరల్, జూలై 9: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష రాష్ట్ర అధికారి ఎండీ ఇస్మాయిల్, సీఎంవో చామంతి నాగేశ్వరరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు అందించిన స్కూలు కిట్లును తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రవేశాలపై ఆరా తీశారు. నాణ్యత లేని కిట్లు ఉంటే తిరిగి పంపాలని సూచించారు. వారి వెంట పాఠశాల హెచ్ఎం ప్రకాష్ ఉన్నారు.

ప్రత్తిపాడు ఆసుపత్రిలో ఎలక్ట్రికల్ బెడ్



ప్రత్తిపాడు, జూలై 9: ప్రత్తిపాడులోని వైద్యవిధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ.లక్ష వ్యయంతో ఎలక్ట్రికల్ బెడ్ ఏర్పాటు చేశారు. బెంగుళూరు నుంచి గుండెవ్యాధిగ్రస్తుల సౌకర్యార్థం ఈ బెడ్‌ను ఆసుపత్రికి తరలించి మంగళవారం నుంచి వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సెమీ ప్రోగ్రాంలో భాగంగా ఈ బెడ్‌ను ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్టు సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య తెలిపారు. వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రప్రథమంగా ప్రత్తిపాడు ఆసుపత్రికి ప్రయోగాత్మకంగా ఈ ఎలక్ట్రికల్ బెడ్ ఏర్పాటు చేసినట్టు ఆమె చెప్పారు.

మెప్మా కార్యాలయంలో సమావేశం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 9: మెప్మా పథక సంచాలకులు కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పథక సంచాలకులు బి.ప్రియంవద మెప్మాలో అమలు జరుగుతున్న అన్ని పథకాలపై సమీక్ష చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన టార్గెట్స్ అన్ని విధిగా పూర్తి చేయమని, సంఘాలను, సమాఖ్యలను బలోపేతం చేయాలన్నారు. బడిబయట పిల్లలను పాఠశాలలకు వెళ్లే విధంగా సంఘ సమావేశాల్లో చర్చించి చేర్పించాలన్నారు. బధిర పిల్లలను గుర్తించి వసతి గృహాల్లో చేర్పించాలన్నారు.

'జీవితాలు పాడుచేసుకోవద్దు'

గండేపల్లి, జూలై 9: యువత చెడువ్యసనాలతో జీవితాలు పాడు చేసుకోవద్దని గండేపల్లి ఎస్ఐ ఎస్.రామకృష్ణ అన్నారు. మంగళవారం సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులు గంజాయి, సిగరెట్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు.

పశుగ్రాస వారోత్సవాలు

రౌతులపూడి, జూలై 9: బలరామపురం రైతు భరోసా కేంద్రం నందు పశుగ్రాస వారోత్సవాలను మండల పశు వైద్యాధికారి ముద్రగడ వీరరాఘవరావు అధ్యక్షతన నిర్వహించారు. పశుగ్రాసల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఏడి మనోజ్, వైద్యులు డా.ప్రసాద్, లావణ్య, విభ ఉన్నారు.

పేదలకు అన్నదానం

జగ్గంపేట, జూలై 9: ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ అడబాల రామాంజనేయులు జన్మదినం పురస్కరించుకుని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ సాదే నరేంద్రబాబు ఆధ్వర్యంలో జగ్గంపేటలో పేదలకు అన్నదానం నిర్వహించారు. దళిత నాయకులు, బీఎస్పీ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్, లాయర్ గొడుగు ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో అన్నదానం

గండేపల్లి, జూలై 9: మండలంలో మల్లేపల్లిలో జాతీయ రహదారి పక్కన వెలసిన అభయాంజనేస్వామి ఆలయం వద్ద మంగళవారం గ్రామానికి చెందిన భక్తులు ఎన్.దుర్గారావు కుటుంబ సభ్యులు, కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు.